క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక

బూర్గంపాడు: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం మండల, జిల్లా స్థాయిలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు నాగినేనిప్రోలు ఎంపీపీఎస్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రిమూర్తులు ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం వెల్లడించారు. నాగినేనిప్రోలు ప్రాథమిక పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎండి.నౌషద్‌పాషా, సీహెచ్ సాగర్ చంద్ర, ఎస్.తమస్, ఎం.తరుణిశ్రీలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు క్రీడల్లో తగువిధమైన శిక్షణనిచ్చి వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు పీఈటీ యన మండల వేణుగోపాల్ చేసిన కృషిని ఆయన అభినందించారు.

పారిశుద్ధ్య పనుల్లో సర్పంచ్, ఉపసర్పంచ్



పంచాయతీలో చెత్త సేకరిస్తున్న సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్

అశ్వాపురం: గత 20 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండటంతో గ్రామాల్లో చెత్తా, చెదారం పేరుకుపోయింది. భారీ వర్షాలకు చెత్తా, చెదారం, దోమలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్ గ్రామంలో పంచాయతీ ట్రాక్టర్ ద్వారా వీధుల్లో చెత్తా, చెదారం తొలగిస్తున్నారు. గత 20 రోజులుగా సర్పంచ్, ఉపసర్పంచ్ పంచాయతీ ట్రాక్టర్‌తో ఇంటింటికి తిరుగుతూ పొడి చెత్త, తడి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ప్రజలు, అధికారుల నుంచి ప్రశంసలు వెలువెత్తుతున్నాయి.

బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

బూర్గంపాడు: భారతీయ మజ్దూర్ సంఘ్ 69వ ఆవిర్భావ దినోత్సవం సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ నాయకులు బీఎంఎస్ జెండాను ఎగురవేసి మాట్లాడారు. కార్మిక సంక్షేమం కోసం బీఎంఎస్ చేస్తున్న పోరాటాలను, కార్యాచరణను నాయకులు వివరించారు. కార్యక్రమంలో బీఎంఎస్ అధ్యక్షులు బిజ్జం అశోక్‌రెడ్డి, కార్యదర్శి యిమడాబత్తుని వెంకటేశ్వరరావు(వైపీ), మోరంపల్లిబంజర సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా సీతారామ్‌నాయక్, మండల అధ్యక్షులు బీరక సాయిశ్రీనివాస్, బిజ్జం శ్రీనివాసరెడ్డి, భానుకిషోర్, పి.శ్రీనివాసరావు, భాగ్యరాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాలు



ఆసుపాకలో కూలీలతో కలిసి వరినాట్లు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆపార్టీ నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని ఆసుపాక గ్రామంలో ఆదివారం ఇంటింటికి వెళ్లి పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పార్టీ నాయకులకు ఘన స్వాగతం పలికారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో కూలీలు వరి నాట్లు వేస్తుండగా.. కాంగ్రెస్ నాయకులు వారి వద్దకు వెళ్లారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తమ పార్టీను గెలిపించాలని కోరారు. కూలీలతో కలిసి వరినాట్లు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కునసోతు లింగయ్య, నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, బైగాని రాము పాల్గొన్నారు.

కూలిన పూరిల్లు.. తప్పిన ప్రమాదం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన తలగాని శ్రీనివాసరావుకు చెందిన పూరిల్లు శనివారం అర్ధరాత్రి కూలిపోయింది. గడిచిన కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు, శనివారం రాత్రి వర్షంతోపాటు ఈదురుగాలులతో పూరిల్లు నేలమట్టమైంది. ఇల్లు కూలిపోయిన సమయంలో శ్రీనివాసరావు, భార్య, పిల్లలు ఇంట్లోనే నిద్రిస్తుండగా.. తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఒక్కసారిగా ఇల్లు పడిపోవడంతో ఇంట్లో ఉన్న వారంతా భయందోళనకు గురి కాగా, సురక్షితంగా బయట పడటంతో ఊపిరిపిల్చుకున్నారు.

పనులకు ముహూర్తం ఎప్పుడో?

- ప్రారంభం కాని సెంట్రల్ లైటింగ్ పనులు
- మూడు నెలల క్రితమే నిధులు మంజూరు
- టెండర్ కూడా ఖరారు కాని పరిస్థితి..



సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్న అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి

అన్నపురెడ్డిపల్లి: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కృషితో నియోజకవర్గంలో అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు మూడు నెలల క్రితమే జిల్లా కలెక్టర్ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. అయినప్పటికీ ఇప్పటి వరకు అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికల సమయం నాటికైనా సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభమవుతాయా.. లేదా? అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రూ.5కోట్ల నిధులు..

ఎమ్మెల్యే మెచ్చానాగేశ్వరరావు నాలుగు మండల కేంద్రాలలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం కోసం సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నుంచి నాలుగు మండలాల్లో సెంట్రల్ లైటింగ్, అది వేసే రోడ్డు విస్తరణ, డివైడర్ పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అందులో భాగంగా నూతనంగా ఏర్పడిన అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. రూ 5 కోట్లు నిధులతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 55 అడుగులతో రోడ్డు వైడింగ్, సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులను చేపట్టాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

ఖరారు కాని టెండర్..

సెంట్రల్ లైటింగ్ పనులు అశ్వారావుపేటలో ప్రారంభం కాగా.. ములకలపల్లి, దమ్మపేట మండలాలకు సంబంధించి టెండర్ ఖరారైంది. అన్నపురెడ్డిపల్లి మండల సెంట్రల్ లైటింగ్ పనులకు సంబంధించి టెండర్‌కు ఆహ్వానించ లేదని సంబంధింత అధికారులు చెబున్నారు. టెండర్లు పిలిచి పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా ప్రారంభించాలి



అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో త్వరగా సెంట్రల్ లైటింగ్ పనులను చేపట్టాలి. నూతనంగా ఏర్పడిన అన్నపురెడ్డిపల్లికి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం సంతోషదాయకం.

– విజ్జగిరి సత్యం, అన్నపురెడ్డిపల్లి

త్వరలోనే టెండర్ ఖరారు



అన్నపురెడ్డిపల్లి మండలానికి మంజూరైన సెంట్రల్ లైటింగ్ పనులకు సంబంధించి వారం రోజుల్లో టెండర్‌ను ఆహ్వానిస్తాం. టెండర్ ప్రక్రియ పూర్తైన వెంటనే పనులను ప్రారంభిస్తాం.

– లక్ష్మానాయక్, ఆర్అండ్‌బీ ఏఈ

చేపల వేటకు వెళ్లొద్దు



బూర్గంపాడులో మత్స్యకారులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ వెంకటేష్ తదితరులు

బూర్గంపాడు: గోదావరి వరదల సమయంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ సూచించారు. ఆదివారం బూర్గంపాడు, నాగినేనిప్రోలు, సారపాక ప్రాంతాలలో స్థానిక మత్స్యకారులను కలసి ఆయన మాట్లాడారు. భారీవర్షాలతో గోదావరి, కిన్నెరసాని నదులు వరదలతో పొంగి ప్రవహిస్తున్న ప్రస్తుత తరుణంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులకు సహకరించాలని కోరారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వరదల సమయంలో ఒక్కొసారి ఎంతటి గజ ఈతగాళ్లు కూడా చెట్ల కొమ్మలకు, చేలకు వేసే పెన్సింగ్ తీగలలో, విద్యుత్ తీగలలో ఇరుక్కుపోయి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలున్నాయన్నారు. మత్స్యకారుల పొట్టకొట్టే ఉద్దేశ్యం మాకు లేదని, మీ కుటుంబ సంక్షేమం కోసమే వరదల సమయంలో మాత్రమే చేపల వేటకు వద్దని చెబుతున్నామన్నారు. ఎవరైనా చెరువులలో చేపల వేటకు వెళ్లిన స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని తెలిపారు. బూర్గంపాడుకు సమీపంలోని కిన్నెరసాని వద్ద, నాగినేనిప్రోలులోని పాతగొమ్ము్మారు వద్ద, సారపాకలో గోదావరి వద్ద వరద పరిస్థితిని స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ఆయన పరిశీలించారు. గోదావరి వరదను వీక్షించేందుకు వచ్చే వారిని నియంత్రించేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. నీళ్ల వద్ద సెల్ఫీలను ఎట్టి పరిస్థితులలో అనుమతించ వద్దన్నారు. కార్యక్రమంలో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, బూర్గంపాడు ఎస్సైలు సంతోష్, శ్రీనివాస్, సర్పంచ్‌లు సిరిపురపు స్వప్న, భూక్యా శ్రావణి,ఉప సర్పంచ్ యడమకంటి ఝాన్సీలక్ష్మి, మత్స్యకారులు పాల్గొన్నారు.

సోంపల్లిని వణికిస్తున్న డెంగీ

బూర్గంపాడు: సోంపల్లి గ్రామాన్ని డెంగీ జ్వరాలు వణికిస్తున్నాయి. గత పదిహేను రోజులుగా గ్రామానికి చెందిన పలువురు డెంగీతో బాధపడుతున్నారు.గ్రామానికి చెందిన ముగ్గురు తొలుత డెంగ్ ఫీవర్‌తో ఆస్పత్రి పాలయ్యారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే వేలరూపాయలు ఖర్చయ్యాయి. అయినా జ్వరం తగ్గలేదు. దీంతో వీరు పాల్వంచ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో చేరారు.అక్కడ వైద్యురాలు సింధు వీరికి మెరుగైన వైద్యసేవలను అందించారు. దీంతో గ్రామంలో డెంగీ వచ్చిన వారంతా పాల్వంచ పీహెచ్‌సీకి క్యూ కట్టారు. గ్రామానికి చెందిన 11 మంది వరకు డెంగీతో పాల్వంచ పీహెచ్‌సీకి వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు. వారికి అక్కడ మెడికల్ ఆఫీసర్ సింధు, వైద్యసిబ్బంది మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు.

గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

బూర్గంపాడు: గ్రామపంచాయతీలలో అమలవుతున్న మల్టీ పర్పస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలనర్సారెడ్డి డిమాండ్ చేశారు. సారపాకలో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు, సిబ్బందికి ప్రభుత్వ కనీస వేతనం ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయిస్తుందన్నారు. కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపి వారికి న్యాయం చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, యాకుబ్, సురేష్, జానిమియా, నాయుడు, ఏడుకొండలు పాల్గొన్నారు.

గుండాల: గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గుండాల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కొమరం శాంతయ్య, పీవైఎల్ మండల కార్యదర్శి సన్ప కుమార్, సర్పంచ్ కోమరం సీతారాములు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులు అడుగుతున్న డిమాండ్లు సరైనవి వాటిని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

మణుగూరురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమెమ్మె ఆదివారం 18వ రోజుకు చేరుకోగా.. ఆ శిబిరాన్ని ఆయన సందర్శించి సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అక్కి నరసింహారావు, సీఐటీయూ జిల్లా నాయకులు గద్దల శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, యు.నరసింహారావు, ఇఫ్టూ జిల్లా నాయకులు గౌస్, రవి, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కూలీలను అడ్డుకున్న కార్మికులు

అశ్వాపురం: అశ్వాపురం గ్రామ పంచాయతీలో చెత్తా, చెదారం పేరుకుపోయి వర్షాలకు దుర్వాసనతో దోమలు విజృంభిస్తుండటంతో సర్పంచ్ బాణోత్ శారద, ఉపసర్పంచ్ చందులాల్, పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యామ్నాయ కూలీలో చెత్తా, చెదారం తొలగించే పనులు చేపట్టారు. సమ్మెలో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులు కూలీల పనులను అడ్డుకున్నారు. కూలీలను అడ్డుకున్న విషయం ఎంపీఓ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సై జితేందర్ గ్రామ పంచాయతీ కార్మికులతో పోలీస్ స్టేషన్‌లో చర్చలు జరిపారు. చెత్తా, చెదారం పేరుకుపోయి వర్షాలు, గోదావరి వరదలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న కారణంగా గోదావరి పరివాహక ప్రాంత మండలాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశాలు ఉన్నట్లు ఎస్సై వారికి వివరించారు. పనులకు సహకరించాలని కార్మికులను కోరారు. కాగా, తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు, కార్మికులు చెప్పారు.



మణుగూరురూరల్: మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య



అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు

25న వాహనాల వేలం

అశ్వారావుపేటరూరల్: వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ అయిన వాహనాలను ఈ నెల 25వ తేదీన వేలం వేస్తున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ నాగయ్య ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కార్యాలయంలో జరిగే ఈ వేలంలో పలు రకాల వాహనాలు వేలం ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ చంద్రస్వామి ఆలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన అటవీ శాఖ కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ రేంజర్ బాణాల శ్రీనివాసరెడ్డి, ఆయన సోదరుడు ఐటీసీ ఉద్యోగి సతీష్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆదివారం సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, ఆలయ కమిటీకి రూ.లక్షా 11వేల 116 వితరణగా అందజేశారు.

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం

భద్రాచలంటౌన్: జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం వేడుకలను సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిర్రు సుధాకర్, సరిత, సాకేత్, రామారావు, ప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పొట్టి శ్రీరాములు విద్యానిధి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య విద్యార్థులకు ఆదివారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్య నిత్య అన్నదాన సంత్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రాథమిక విద్యా నుంచి ఇంటర్, డిగ్రీ, బీటెక్ తదితర కోర్సుల విద్యార్థులకు సుమారు రూ.45 వేల విలువైన నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, గట్టు రమేష్, సత్యనారాయణ, కృష్ణయ్య, నాగభూషణం, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్న దాన కార్యక్రమానికి ఆదివారం ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన భక్తులు విరాళం అందజేశారు. ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ పట్టణంలోని హోటల్ స్వర్ణ ప్యాలెస్ యజమాని ముత్తవరపు శ్రీనివాసబాబు–లక్ష్మీదేవి దంపతులు రూ.50 వేల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది సాయిబాబు, రామిరెడ్డి సిబ్బంది తదిరుతుల పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యం



అశ్వాపురంలో డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న విప్ రేగా

అశ్వాపురం: పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నానని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. అశ్వాపురం మండల కేంద్రంలో రూ.4 కోట్లతో జరుగుతున్న ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ పనులను ఆదివారం ఎమ్మెల్యే రేగా కాంతారావు పరిశీలించారు. డ్రెయినేజీ పనుల వివరాలు, పురోగతిని తెలుసుకున్నారు. స్థానికులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగవంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

మండల పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు బారి మల్లయ్య(60) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా.. ఆ గ్రామంలో మల్లయ్య మృతదేహానికి ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మృతదేహానికి నివాళులర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మణుగూరురూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులోనూ తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలోని నర్సింకాలనీ బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయన్నారు. పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. వచ్చే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహరావు, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, ఎంపీటీసీలు గుడిపూడి కోటేశ్వరరావు, కలగూర శంకర్, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, వట్టం రాంబాబు, కోట శ్రీనివాస్, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు..

మండలంలోని గుట్టమల్లారంలో వేంచేసియున్న శ్రీపంచముఖ వేదగాయత్రీదేవి ఆలయంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పినపాక నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రాధాన్యత

ఆర్యవైశ్యుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఆదివారం గుట్టమల్లారం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులు అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమ భవనానికి ప్రభుత్వం కోటి రూపాయలను కేటాయించగా.. మొదటి విడతలో రూ.50లక్షలను మంజూరు చేసిందన్నారు. త్వరలోనే మిగులు నిధులు మంజూరవుతాయని తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ రేగా కాంతారావును సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు దోసపాటి వెంకటేశ్వరరావు, కోలేటి భవాని శంకర్, కత్తి రాము తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి

గౌడ కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రేగా కాంతారావును గౌడ కులస్తులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

చదువుకు సాయమందించరూ..

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన రాయస్‌పేట గిరిజన గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి కుంజా అనిత సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ పంజాబ్‌లో ఈ ఏడాది ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదువుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో చదువు ఖర్చులకు ప్రభుత్వం, దాతల సహాయం కోరుతోంది.

అనిత ఇంటర్ దమ్మపేట మండలం అంకంపాలెం ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో చదివింది. డిగ్రీ యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీలో స్కాలర్‌షిప్‌తో చదివింది. సీయూటీ-పీజీ 2022 పరీక్షలో ర్యాంక్ సాధించి 2022–23 ఏడాదికి ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ పంజాబ్‌లో ప్రవేశం పొందింది. రెండేళ్ల చదువుకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది. అనిత తండ్రి శంకర్ వ్యవసాయ కూలీ కాగా తల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తోంది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి సాయమందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

'గౌతమీస్ఫూర్తి' సహకారం..

విద్యార్థి వినతి మేరకు ఆదివారం భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు విద్యార్థిని సెమిస్టర్ ఫీజుకు రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు



ఎస్సై శ్రీకాంత్



ఎస్సై తిరుపతిరావు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ, ట్రాఫిక్ నూతన ఎస్సైలుగా బదిలీపై వచ్చిన అధికారులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. భద్రాచలంటౌన్ ఎస్సైగా పీవీఎన్ రావు, ట్రాఫిక్ ఎస్సైగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. పీవీఎన్ రావు ఇప్పటి వరకు ఇదే పట్టణంలో ట్రాఫిక్ ఎస్సైగా పనిచేశారు. శ్రీనివాస్ పాల్వంచ రూరల్ ఎస్సైగా పనిచేస్తూ ఇక్కడికి ట్రాఫిక్ ఎస్సైగా బదిలీ అయ్యారు.

అశ్వాపురం: అశ్వాపురం నూతన ఎస్సైగా తిరుమలరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఎస్సైల బదిలీలలో సుజాతనగర్ ఎస్సైగా ఉన్న తిరుపతిరావును ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నూతన ఎస్సైగా పి.శ్రీకాంత్ ఆదివారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, స్టేషన్ సిబ్బంది నూతన ఎస్సైకు పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాని రాజీనామా చేయాలి



చండ్రుగొండ: మతోన్మాద దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

దమ్మపేట: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండకు బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) పాల్వంచ డివిజన్ అధ్యక్షుడు కాక వెంకటేష్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన ఘటనను నిరసిస్తూ ఆదివారం మండల పరిధిలోని చిల్లగుంపులో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి, హత్య చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బొగ్గం రాజులు, రాము, మల్లికార్జున్, నాగేశ్వరరావు, లక్ష్మడు, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి.. వారిని సామూహికంగా అత్యాచారం చేసి హింసాకాండకు పాల్పడిన దోషులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఇఫ్టూ నాయకులు మంగీలాల్ డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్త్రీమూర్తులపై మణిపూర్ ఘటన మాయని గాయమన్నారు. ఆదివాసీ మహిళలపై జరిగిన దాడులను ప్రతీ ఒక్కరు ఖండించాలన్నారు. ఈ సమావేశంలో నాగమణి, ఎల్లమ్మ, రమాదేవి, నందిని, అనసూయ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: మణిపూర్ అల్లర్లకు నిరసనగా మతోన్మాదం దిష్టిబొమ్మను సీపీఎం మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం దహనం చేశారు. ప్రధాన సెంటర్‌లోని జాతీయ రహదారిపై ఆ పార్టీ నాయకులు తొలుత నిరసన వ్యక్తం చేశారు. మతోన్మాదం నశించాలని, మణిపూర్ దుస్థితిపై ప్రధాని మోదీ స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పెద్దిని వేణు, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, జైతూన్‌బేగం, అబ్దుల్ రహెమాన్, అప్పారి నాగేశ్వరరావు, పవన్‌కల్యాణ్, వంశీ, రాజు, నరేందర్ పాల్గొన్నారు.